

నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి సీఎంసీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది

## కామారెడ్డిలో 8.76 లక్షల మంది ఓటర్లు..

జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని కామారెడ్డి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో మొత్తం 913 పోలింగ్ స్టేషన్లలో 64 ప్రాంతాల్లో 183 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలో 4196 మందిని నియమించారు. అదనంగా 20శాతం అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచారు. మొత్తం 5044 మంది అందుబాటులో ఉండనున్నారు. మైక్రో అబ్జర్వర్లను కలిపితే 5143 మంది పోలింగ్ ప్రక్రియలో భాగస్వామ్యం అవుతున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక పీవో, మరొక ఏపీవో, ఇద్దరు ఓపీవోలు ఉంటారు. కామారెడ్డి నియోజకవర్గంలో 266 పోలింగ్ కేంద్రాలకు మొత్తం 1064 మంది, జుక్కల్ నియోజకవర్గంలో 255 పోలింగ్ కేంద్రాలకు 1020 మంది, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 270 పోలింగ్ కేంద్రాలకు 1080 మంది, బాన్సువాడలో 258 పోలింగ్ కేంద్రాలకు 1032 మందిని నియమించారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక ప్రాంతాల్లో 73 మంది, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో 195 మందిని మైక్రో అబ్జర్వర్లను నియమించారు. జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోని కామారెడ్డి జిల్లాలో 1977 బ్యాలెట్ యూనిట్లు, 987 కంట్రోల్ యూనిట్లు, 1107 వీవీ ప్యాట్లను ఏర్పాటు చేస్తున్నారు. జహీరాబాద్ లోక్‌సభలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో మొత్తం 8లక్షల 76వేల 615 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళలు అత్యధికంగా 4లక్షల 54వేల 427 మంది, పురుషులు 4లక్షల 22వేల 145 మంది, థర్డ్ జెండర్ 43 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

### బరితెగించిన కాంగ్రెస్, బీజేపీ


అధికార కాంగ్రెస్, బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లో బరితెగించాయి. అధికార బలాన్ని అడ్డం పెట్టుకొని పలుచోట్ల మద్యం, డబ్బును విచ్చలవిడిగా పంచినట్లుగా తెలుస్తున్నది. గెలుపుపై ధీమా కోల్పోయిన ఈ రెండు జాతీయ పార్టీలు రాత్రికి రాత్రే ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు దొడ్డి దారిలో పయనించినట్లుగా సమాచారం. పోలీసులు, ఎన్నికల యంత్రాంగం మాత్రం చూసీచూడనట్లు వ్యవహరించినట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



# సార్వత్రిక పోరుకు సర్వంసిద్ధం

## నేడే పోలింగ్

- ఉదయం 7 నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్
- పోలింగ్‌స్టేషన్ల వద్ద 144 సెక్షన్ అమలు
- కామారెడ్డి జిల్లాలో 8.76 లక్షల మంది..
- నిజామాబాద్ లోక్‌సభలో 17.04లక్షల మంది ఓటర్లు
- రాత్రికి రాత్రే పలుచోట్ల ఏరులై పారిన మద్యం, డబ్బులు



పోలింగ్ కేంద్రంలో అభ్యర్థుల వివరాలను ప్రదర్శిస్తున్న సిబ్బంది



బోధన్‌లో ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది

నిజామాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సార్వత్రిక సమరానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా నాల్గో విడుత పోలింగ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం అన్ని చర్యలు తీసుకున్నది. ఉదయం 7 నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ కొనసాగనున్నది. ఈసారి గంట సమయాన్ని అదనంగా కేటాయించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లో నిర్వహించనున్న పోలింగ్ కోసం అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 17లక్షల 4వేల మంది ఓటర్లున్నారు. జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోని కామారెడ్డి జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 8 లక్షల 76వేల మం ది ఓటర్లున్నారు. రెండు జిల్లాల్లోనూ పురుషులతో పోలిస్తే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉండడం విశేషం.

### విస్తృత తనిఖీలు.. నగదు, మద్యం పట్టివేత

నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద ఇప్పటి వరకు 137 కేసులు నమోదు కాగా రూ.2.63 కోట్ల నగదును సీజ్ చేశారు. సరైన ఆధారాలు చూపిన రూ.2.35 కోట్ల నగదును తిరిగి సదరు వ్యక్తులకు అందించారు. 2కిలోల బంగారం, రూ.76లక్షలు విలువ చేసే వివిధ రకాల వస్తువులు పట్టుబడ్డాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు కామారెడ్డి జిల్లాలో రూ.1.92కోట్ల నగదు, రూ.15.85లక్షల విలువ చేసే 7వేల 45 లీటర్ల మద్యం, రూ.16.50లక్షలు విలువ చేసే గంజాయి పట్టుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

## నిఘా నేత్రం నీడలో..

లోక్‌సభ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో పోలింగ్ కేంద్రాల్లో అల్లర్లు, సమస్యలు తలెత్తేవి. అలాంటి వాటికి చెక్ పెట్టేందుకు ఎన్నికల సంఘం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, సార్వత్రిక ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియ చేపట్టారు. ఇది సత్ఫలితాలను ఇవ్వడంతో ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల్లోనూ అమలు చేస్తున్నారు. మొన్నటి వరకు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. ఇప్పుడా స్థానంలో అన్ని చోట్లా నిఘా మధ్యనే ఓటింగ్ జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. మొన్నటి శాసనసభ ఎన్నికల్లో ఒక కెమెరా పోలింగ్ కేంద్రంలో, మరోటి బయట బిగించారు. దీంతో బయట ఉన్న వ్యక్తులతో పాటు లోపల జరిగే ప్రక్రియంతా అందులో నిక్షిప్తమైంది. ఈసారి కూ డా అదే విధానాన్ని అనుసరిస్తున్నారు. నిఘా కెమెరాల లోపల చిప్ అమరుస్తున్నారు. అం దులో ఎన్నికల ప్రక్రియ అంతా రికార్డు అవుతుంది. ఎక్కడైనా సమస్య ఎదురైతే వెంటనే అందులో చూసేందుకు ఆస్కా రం ఉంటుం ది. ఆయా సీసీ కెమెరాలను కలెక్టరేట్‌కు అనుసంధానం చేస్తున్నారు.



నగరంలోని దుబ్బ పోలింగ్ కేంద్రంలో పోలీసు బలగాలు

## నిజామాబాద్‌లో 17.04 లక్షల మంది ఓటర్లు..

నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లలో మొత్తం 1808 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. వీటిల్లో 4497 బ్యాలెట్ యూనిట్లు, 2293 కంట్రోల్ యూనిట్లు, 2511 వీవీ ప్యాట్లను ఏర్పాటు చేస్తున్నారు. బ్యాలెట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ యంత్రాలు మొరాయిస్తే ఎన్నికల ప్రక్రియ నిలిచి పోకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయంగా అదనపు కేటాయింపులు జరిపారు. 302 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. 2508 సీసీ కెమెరాలను బిగించారు. నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక పీవో, ఏపీవో, ఇద్దరు ఓపీవోలు కలిపి 7232 మందిని నియమించారు. వీరికి అదనంగా 20శాతం మందిని అత్యవసర సేవలకు వినియోగించుకుంటున్నారు. మొత్తం ఏడు నియోజకవర్గాల్లో 17లక్షల 4వేల 867 మంది ఓటర్లు ఉన్నారు. మహిళలు అత్యధికంగా 8లక్షల 98వేల 647 మంది, పురుషులు 8లక్షల 6వేల 130 మంది ఓటర్లున్నారు. థర్డ్ జెండర్‌కు చెందిన వారు 90 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. కేవలం జగిత్యాల నియోజకవర్గాన్ని మినహాయిస్తే మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో పురుషుల కన్నా మహిళా ఓటర్లే ఎక్కువగా ఉండడం గమనార్హం.

## డబ్బులతో పట్టుబడిన జాతీయ పార్టీ నాయకుడు

వినాయక్‌నగర్, మే 12: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఓ జాతీయ పార్టీకి చెందిన యువ నాయకుడు డబ్బులు పంచేందుకు వెళ్తున్నట్లుగా ఎన్నికల స్క్వాడ్‌తోపాటు పోలీసులకు పలువురు సమాచారం అందించారు. ఆదివారం రాత్రి వర్నిరోడ్డు చౌరస్తా వద్ద చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి ఐదో టౌన్ ఎస్సై జి.అశోక్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఓ యువ నాయకుడు తన వెంట డబ్బులు తీసుకొని వెళ్తున్నట్లుగా సమాచారం వచ్చిందని, వెంటనే తన సిబ్బందితో కలిసి వర్నిరోడ్డు చౌరస్తాకు చేరుకున్నారు. అదే సమయంలో జాతీయ పార్టీకి చెందిన చిరంజీవి అనే యువ నాయకుడిని ఎస్సై వెంబడించి పట్టుకున్నారు. అతన్ని తనిఖీ చేయగా రూ.42 వేలు నగదు లభించినట్లు ఎస్సై వెల్లడించారు. అదుపులోకి తీసుకున్న నాయకుడిపై కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తామని తెలిపారు.

# వైద్యశాఖలో మరో లైంగిక వేధింపుల ఘటన

### సూపరింటెండెంట్‌పై ఫిర్యాదు చేసిన మహిళా వైద్యులు

రామారెడ్డి, మే 12: మహిళా వైద్యులను వేధిస్తున్న డీఎంహెచ్‌వో ఘటన మరువక ముందే వైద్యశాఖలో పనిచేసే సూపరింటెండెంట్‌పై ఫిర్యాదు వెలుగు చూ సింది. డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ తీరుపై మహిళా వైద్యులు ఇటీవల నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేసి న సంగతి తెలిసిందే. తాజాగా జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఏ.శ్రీనివాస్‌పై మహిళా వైద్యులు కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసేందుకు ముందుగా భయపడినా.. వారికి జిల్లా వైద్యులు తోడుగా ఉంటామని భరోసా ఇవ్వడంతో ముందుకు వచ్చినట్లు తెలిసింది. విచారణ చేపట్టి సూపరింటెండెంట్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మహిళా వైద్యులు డిమాండ్ చేస్తున్నారు.

**డీఎంహెచ్‌వోపై విచారణకు ఆదేశాలు..**

డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌పై వైద్యశాఖ విచారణకు ఆదేశించింది. విచారణ అధికారిగా డాక్టర్ అమర్‌సింగ్ నాయక్‌ను నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. ఈనెల 15వ తేదీన ఉదయం పది గంటలకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించే విచారణకు జిల్లాలోని పీహెచ్‌సీల్లో పనిచేసే మహిళా వైద్యులు, డీఎంహెచ్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న ఇతర అధికారులు తగిన ఆధారాలతో అధికారి ఎదుట హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు.



ఎల్లారెడ్డి శివారులోని ఓ పొలంలో నిలిచిన నీరు

## కామారెడ్డి జిల్లాలో మోస్తరు వర్షం

కామారెడ్డి/ఎల్లారెడ్డి/ గాంధారి/ మాచారెడ్డి/ దోమకొండ/ బీబీపేట్, మే 12 : కామారెడ్డి జిల్లాలో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం పొడిగా, ఉక్కపోత గా ఉన్న వాతావరణం మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా చల్లబడింది. జిల్లా కేంద్రంలో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో గంటపాటు చిరుజల్లులు కురిశాయి. ఎల్లారెడ్డి పట్టణంలో ఓ మోస్తరు వర్షం కురువగా పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా పడింది. ఎల్లారెడ్డికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉ న్న మీసాన్ పల్లి, భిక్కనూరు, శివ్వాపూర్, పెద్దారెడ్డి, మత్తమాల తదితర గ్రామాల్లో మధ్యా హ్నం మూడు గంటల అనంతరం కురిసిన వర్షంతో వ్యవసాయ భూముల్లో నీరు నిలిచింది. పెద్దగా కురిసిన చినుకులు వర్షాకాలాన్ని తలపించాయని పలు గ్రామాల రైతులు తెలిపారు. గాంధారితోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో మధ్యాహ్నం వరకు ఎండ దంచికొట్టగా.. ఒకేసారి ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. సోమారంతండాలో బలమైన గాలులు వీయడంతో కెతావత్ గఫ్పాకు చెందిన నివాసపు షెడ్డు రేకులు ఎగిరిపోయాయి. రేకులు పక్కనే ఉన్న ఎద్దుపై పడడంతో దానికి తీవ్ర గాయాలయ్యాయని బాధితుడు తెలిపాడు.మాచారెడ్డితోపాటు, గజ్యానాయక్ తండా, ఎక్స్‌రోడ్, ఘన్‌పూర్, అక్కాపూర్, పాల్వంచ, భవానీపేట, చుక్కాపూర్ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దోమకొండ మండలంలో తేలికపాటి వర్షం కురిసింది. కల్లాల్లో ఎండబెట్టిన ధ్యానం తడవకుండా రైతులు టార్పాలిన్లు కప్పారు. బీబీపేట్ మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులకు పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది.



## నెర్రెలుబారిన త్రివేణి సంగమం

ఏటా గల గలా పారేటి గంగమ్మ తల్లి.. ఈఏడాది నీరు లేక వెలవెలబోతోంది. మండలంలోని కందకుర్తి వద్ద గోదావరి, హరిద్రా, మంజీరా నదులు ఒకేచోట కలిసే త్రివేణి సంగమ క్షేత్రం చుక్క నీరు లేక బీటలువారి నల్లమట్టి దర్శనమిస్తున్నది. భానుడి ప్రతాపానికి రానున్న రోజుల్లో మూగ జీవాల దాహార్తిని తీర్చడం ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

–రెంజల్, మే 12